క్లుప్తంగా

కార్నియాల సేకరణ


నేత్రదానం చేసిన సరస్వతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో నేత్రదానానికి ముందుకొచ్చిన నగరానికి చెందిన ఉడత సరస్వతి ఇటీవల మృతి చెందగా, ఆమె కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు సేకరించారని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్నియాల ద్వారా ఇరువురు అంధలకు చూపు వస్తుందని పేర్కొన్నారు. దాత కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి రత్నకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దంత సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దంత సమస్యలపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు విద్యార్థులకు సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలపై శనివారం స్థానిక అమీనా పేటలో ఉన్న సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ హెచ్ఓడీ డాక్టర్ కంచర్ల వంశీ ప్రసాద్ దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నరేంద్ర, స్కూల్ హెచ్ఎం వి.స్రవంతి, పీఈటీ వర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం


సమావేశంలో పాల్గొన్న అతిథులు, అంగన్‌వాడీలు

ఏలూరు (టూటౌన్): బాల్యవివాహాలపై అవగాహన పెంపొందించుకోవాలని 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్ అన్నారు. స్థానిక పుష్పలీలా నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు. ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని తంగెళ్లమూడి ఎలిమెంటరీ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- ఏలూరు నగరంలో ఎక్కడి చెత్త అక్కడే
- విజృంభిస్తున్న దోమలు
- ప్రజలపై సీజనల్ వ్యాధుల దాడి
- కానరాని చెత్త సేకరణ బండ్లు


గొల్లాయిగూడెం పరిసరాల్లో హేలాపురి కాలనీ వద్ద పేరుకుపోయిన చెత్త

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. డ్రెయిన్ల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో ఇంటింటికీ చెత్త సేకరణ చేసే సిబ్బంది నేడు అప్పుడప్పుడూ కనిపిస్తున్నారు. దీంతో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లోనే చెత్తను డంప్ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు సాఫీగా పారక రోడ్డుపైకి వస్తోంది. దోమలు విజృంభించి, ప్రజలు జ్వరాల బారిన పడి, ఆసుపత్రుల పాలవుతున్నారు.

మొక్కుబడిగా 'స్టాప్ డయేరియా'

నగరంలో రెండు నెలలు పాటు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించినట్టు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ శాఖ ప్రకటనలు గుప్పిస్తుంది. వాస్తవానికి ప్రతి రోజూ ఏదో ఒక డివిజన్‌లో మొక్కుబడిగా పర్యటించి అక్కడి దోమల లార్వా నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు, ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఫొటోలు తీసుకుని వచ్చేసారే తప్ప ఆ ప్రాంతంలో పూర్తి స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

మురికివాడల్లో కానరాని నివారణా చర్యలు

నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సుమారు 70 వరకు మురికివాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వర పీడితులను కీళ్ల నొప్పులు, తిమ్మెరలు వంటివి నెలల తరబడి వేధిస్తున్నట్టు చెబుతున్నారు.


చింతలపూడి వెళ్లే దారిలో చెత్త గుట్ట


బాలయోగి వంతెన సమీపంలో దుర్గంధం వెదజల్లుతున్న జంతు కళేబరాలు, వ్యర్థాలు

పరీక్షల పేరుతో దోపిడీ

జ్వర పీడితులను రక్త పరీక్షల పేరుతో నిలువ దోపిడీ చేస్తున్నారు. స్థానిక హెల్త్‌సెంటర్‌లో సాధారణ జ్వరాలకు మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. అనుమానం ఉన్న రోగులను మెరుగైన పరీక్షలకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్లమని సూచిస్తున్నారు. అక్కడకు రక్త పరీక్షలు ఒక రోజు, సంబంధించిన రిపోర్టులు మరుసటి రోజు ఇస్తున్నారు. దీంతో బాధితులు ప్రైవేటు పరీక్షా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు పరీక్షా కేంద్రాలు బాధితుల వద్ద రూ.1000 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో పేదలు లబోదిబోమంటున్నారు.


బీడీ కాలనీలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం

చెత్త సేకరణ నామమాత్రం



గతంలో ఇంటింటికీ వచ్చి చెత్త సేకరణ చేసేవారు. దానికి భిన్నంగా ప్రస్తుతం ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం అంతా మొక్కుబడిగానే సాగుతోంది. దీని వల్ల ఎక్కడి చెత్త అక్కడ పోగు పడిపోతుంది. కొన్ని సందర్భాల్లో రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో స్థానికులు వేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలో మాదిరిగా ఇంటింటి చెత్త సేకరణ పై ప్రస్తుత పాలకులు దృష్టి సారించాలి.

– బి.నాగరాజు, బాప్టిస్ట్‌పేట, ఏలూరు

పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలి



నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్మూలనకు మొక్కుబడిగా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి. డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ కొరవడి పారిశుద్ధ్యం పడకేసింది. ప్రజలను వ్యాధుల నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.

– గారపాటి నాగేశ్వరరావు, ఏలూరు

ప్రధాన రహదారుల్లోనే శుభ్రత

ప్రధాన రహదారుల్లో మాత్రమే ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది, మారుమూల ప్రాంతాల్లో మాత్రం గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆ ప్రాంత కార్పొరేటర్లు వంటి వారు ఉన్న ప్రాంతాల్లో చూపుతున్న శ్రద్ధ ఇతర ప్రాంతాల్లో చూపడంలేదని ప్రజలు వాపోతున్నారు.

నిత్యం వందల సంఖ్యలో జ్వర పీడితులు

ఏలూరు నగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి రోజూ వందల సంఖ్యలో జ్వరబాధితులు ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. వైద్య సేవలు తీసుకుని జ్వరం తగ్గినా దాని ప్రభావం వల్ల పది నుంచి 15 రోజులు శరీరంలో నిస్సత్తువ ఆవహిస్తుందని, నీరసంగా ఉంటుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గుతున్నా, దాని ప్రభావం వల్ల వచ్చే ఇతర సమస్యలు రోజుల తరబడి పట్టి పీడిస్తున్నాయని వాపోతున్నారు. మరోపక్క వైద్యులు ప్రస్తుత సీజన్‌లో వచ్చేవన్నీ సాధారణ జ్వరాలే అధికమని, మలేరియా, డెంగీ వంటివి చాలా తక్కువ కేసులని, కొద్ది మోతాదులో టైఫాయిడ్ జ్వరాలు వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సమాజాభివృద్ధికి బాలికల విద్య దోహదం


మాట్లాడుతున్న వృక్షశాస్త్ర అధ్యాపకురాలు పద్మావతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : బాలికల విద్య, ఆవశ్యకతపై అవగాహన కల్పించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం రాంబాబు తెలిపారు. గత నెల 25 నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ క్యాంపెయిన్ చేతన 3.0లో భాగంగా బాలికల విద్య ఆవశ్యకతపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి బాలికల విద్య ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకులు ఎస్ సుస్యలత, డి.సుజాత మాట్లాడుతూ ఒక స్త్రీ చదువుకుంటే ఆమె కుటుంబం మొత్తం విద్యావంతులవుతారని వివరించారు. రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకుడు టి.వెంకట దుర్గాప్రసాద్ బాలికల విద్యకు సంబంధించిన చట్టాలను వివరించారు. బాలికల విద్యపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, సమాజాన్ని చైతన్య పరిచేందుకు తనవంతు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

మత్తు పదార్థాలతో నాడీ వ్యవస్థకు నష్టం


ఎస్సై నాగకళ్యాణికి స్వాగతం పలుకుతున్న సెయింట్ థెరిస్సా స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఎస్పీ కె.శివ కిషోర్ రూపొందించిన డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా ఏలూరు 2 టౌన్ ఎస్సై వైవీ రమణ, మహిళా ఎస్సై నాగ కళ్యాణి శనివారం స్థానిక సెయింట్ థెరిసా బాలికల హై స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. సోషల్ మీడియా అనర్థాలపై వాల్‌పోస్టర్ ద్వారా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లను గురించి అవగాహన కల్పించారు. డయల్ 112కు సమాచారం అందిస్తే పోలీసు సేవలు అందుతాయన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సందడిగా షష్ఠి ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మార్గశిర శుద్ధ షష్ఠి పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో షష్ఠి మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. పుట్టలో పాలు పోశారు. ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామి వారి శాంతి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం, దండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రం, అశోక్ నగర్ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం, సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయం, పాతబస్టాండ్ వద్ద పాండురంగ స్వామివారి దేవస్థానాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించారు.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అలంకరణలో సత్రంపాడు లక్ష్మీ గణపతి


పాండురంగ స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	06
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	08
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	68
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-36	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	64	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

విచిత్ర వేషధారణలతో అలరించిన విద్యార్థినులు


ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో విద్యార్థినులు


వివిధ వేషధారణల్లో విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విచిత్ర వేషధారణలతో విద్యార్థినులు అలరించారు. చిత్రలేఖనంలో ఎన్ మీనాక్షి ప్రథమ, ఆర్ సామశ్రీ ద్వితీయ, పి.లక్ష్మప్రసన్న తృతీయ, ముగ్గుల పోటీల్లో కే.తేజస్విని ప్రథమ, సీహెచ్ శ్రావణి ద్వితీయ, యు.శ్రావణి తృతీయ స్థానాల్లో నిలిచారు. ఫ్యాన్సీ డ్రెస్‌లో ఎస్‌కే రిజ్వానా ప్రథమ, సీహెచ్ఎం ప్రియాంక ద్వితీయ, ఎం ప్రమీల తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాధరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ అభినందించారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధ్యాయుడు అహ్మద్ మృతికి సంతాపం


ఏజాష్ అహ్మద్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల రాయచోటి జిల్లా కొత్తపల్లి మండలంలో విద్యార్థులు కొట్టడం వల్ల మనస్థాపానికి గురై మరణించిన ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్ మరణానికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్స్ నల్ల రిబ్బన్లు ధరించి సంతాపం వ్యక్తం చేసినట్టు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ తెలిపారు. స్థానిక కేపీడీటీ పాఠశాలలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోనే విద్యార్థులు కొట్టడం వల్ల ఉపాధ్యాయుడు మరణించడం అంటే, పాఠశాలలో, కాలేజీల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. కొందరు విద్యార్థులు ప్రవర్తన ఆందోళనకరంగా ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో పీటీఎల్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టు శ్యాం ప్రసాద్, గంట వెంకటయ్య, జనరల్ సెక్రటరీ కాళ్ల లోకనాథం, రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ పెనుమత్స కిరణ్ కుమార్ రాజు, రాష్ట్ర సెక్రటరీ పోలిచర్ల రషీద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉన్న 1841 పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించామని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థి సమగ్ర ప్రగతి నివేదికపై చర్చించామని పేర్కొన్నారు. తల్లులకు రంగోలి పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు, విద్యార్థులు, వారి తల్లితండ్రులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల ప్రగతి నివేదిక సమర్పించారని, సమావేశాల్లో పాల్గొన్న అందరికీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ఏర్పాటు చేశామని వివరించారు.

ఉపాధితోపాటు ఆదాయం పెంపునకు కృషి

బుట్టాయగూడెం: గిరిజనులకు ఉపాధి కల్పించడంతోపాటు ఆదాయ వనరులను పెంచడమే వన్‌దన్ వికాస్ కేంద్రాల లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన నాగంపాలెంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ వికాస్ కేంద్రాన్ని జేసీ శనివారం సందర్శించారు. గ్రామంలోని గిరిజన మహిళల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన విస్తర్ల తయారీ మెషీన్‌ను ఆమె పరిశీలించారు. గిరిజనులు అడవిలో సేకరించిన ఉత్పత్తుల ద్వారా వన్‌దన్ కేంద్రాల్లో తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాన్ని వినియోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలపతిరావు, వెలుగు ఏపీడీ రాజబాబు, ఏపీఎం పద్మావతి, ఏటీడబ్ల్యూఓ శ్రీవిద్య, డ్రీమ్‌డే సొల్యూషన్ కన్సల్టెన్సీ కంపెనీ వ్యవస్థాపకులు శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా శ్రద్ధ వహించాలి

పెదవేగి : చక్కటి ఆటపాటలతో చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మిషన్ సభ్యుడు డాక్టర్ జే రాజేంద్రప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పోషకాహార పంపిణీ తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పోషకాహారాన్ని, అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి పాల్గొన్నారు.

హస్త కళల్లో మహిళలు రాణించాలి

చింతలపూడి : హస్త కళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు హస్త కళ సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో శనివారం హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కమిషనరేట్ సహకారంతో హస్త కళాకారులకు ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ హస్త కళల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా నిర్వహిస్తోన్న గురు శిష్య రెండు నెలల శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హస్తకళాకారులు రూపొందించిన వస్తువులను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించేలా చేసి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేయడమే కేంద్రం ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చింతలపూడి లాంటి గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా హస్తకళలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.